లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు..


సీతాఫల్‌మండిలో నిరుపయోగంగా ఓపెన్ జిమ్

- నిర్వహణ లేక నిరుపయోగం
- తుప్పు పడుతున్న పరికరాలు
- లష్కర్‌లో ఓపెన్ జిమ్‌ల దుస్థితి

సికింద్రాబాద్: ప్రజారోగ్యం పేరిట జీహెచ్ఎంసీ యంత్రాంగం వెచ్చిస్తున్న రూ.లక్షలు మట్టిపాలవుతున్నాయి. ఏడేళ్ల క్రితం అన్ని డివిజన్లలో ఏర్పాటు చేసిన ఇండోర్ జిమ్‌లు కాలగర్భంలో కలిసిపోయాయి. ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్‌లు మట్టిపాలవుతున్నాయి. ఉరుకులు పరుగుల నగర జీవితంలో వ్యాయామం ఆరోగ్యం అందరికీ అవసరం. అయినప్పటికీ అందరు ప్రైవేటు జిమ్‌లను ఆశ్రయించే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో కాలనీలు, బస్తీల్లో నివసించే ప్రజల కోసం మొదటి దఫా ఇండోర్ స్టేడియంలు ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు గతేడాది ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది.

☛ కాలనీలు, బస్తీలలోని పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల పేరిట విలువైన వ్యాయామ పరికరాలు బిగించారు. పరిసర ప్రాంతాల్లోని యువకులు, మహిళలు, పిల్లలు వ్యాయామం చేసేందుకు వీలుగా వసతులు ఏర్పాటు చేశారు. ఇంత వరకు పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ వాటి నిర్వహణ వ్యవహారాలు చేసేవారే కరువయ్యారు. పట్టించుకోకుండా వదిలేయడంతో పరికరాలన్నీ తుప్పుపట్టిపోతున్నాయి.


మెట్టుగూడ ఓపెన్‌జిమ్‌లో శిథిలావస్థకు చేరుతున్న వ్యాయామ పరికరాలు

తొలుత కమ్యూనిటీహాళ్లలో....

గత పాలకమండలి హయాంలో (ఏడేళ్ల క్రితం) సికింద్రాబాద్ నియోజవకర్గం పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో ఐదు జిమ్‌లను జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌లో ఒక్కో కమ్యూనిటీహాలును ఎంపిక చేసి వ్యాయామం కోసం వినియోగించే ఖరీదైన పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో వ్యాయామశాల ఏర్పాటు కోసం రూ.10 లక్షలు వెచ్చించారు. ఆయా కేంద్రాల్లో కోచ్‌లను నియమించి యా ప్రాంతాల యువకులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో ఏర్పాటు చేసిన జిమ్‌లు కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం అయ్యాయి. జిమ్‌లలో కోచ్‌లను నియమించక పోవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. క్రమేణా జిమ్ పరికరాలన్నీ మాయమై కమ్యూనిటీహాళ్లు మాత్రమే మిగిలాయి.

ఓపెన్ జిమ్‌ల పేరిట మలివిడత...

సరిగ్గా ఏడాది క్రితం సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఉదయం, సాయంత్రం పార్కుకు వచ్చే ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో నాలుగు, బౌద్ధనగర్, అడ్డగుట్ట, మెట్టుగూడ డివిజన్లలో రెండేసి, తార్నాక డివిజన్‌లో ఒకటి మొత్తంగా 11 ఓపెన్ జిమ్‌లను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. ఇందుకుగాను రూ. 60 లక్షలు వెచ్చించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా తుప్పు పట్టి చెడిపోతున్న పరికరాలు పూర్తిగా శిథిలావస్థకు చేరకముందే వాటికి మరమ్మతులు చేసి, పార్కుల్లో మళ్లీ పచ్చదనం నింపి ఆయా ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

‘బస్తీబాట’తో విద్యుత్ సమస్యలకు చెక్

- క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు..
- ప్రతి బుధవారం ఒక్కో బస్తీలో పర్యటన..
- లైన్‌మెన్ నుంచి ఎస్ఈ వరకు ప్రాంతాల సందర్శన..


రాజీవ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు (ఫైల్)

సనత్‌నగర్: సార్..మా ఏరియాకు సంబంధించిన ఫీడర్ మాటిమాటికీ ట్రిప్పు అవుతుండడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యకు పరిష్కారం చూపండి. అంటూ ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఓ వినియోగదారుడి అభ్యర్థన.

☛ సార్ మా ఏరియాలో కరెంటు స్తంభం నుంచి స్పార్క్స్ వస్తున్నాయి. స్థానికంగా భయాందోళన నెలకొంది. పరిష్కారం చూపండంటూ విద్యుత్ అధికారికి మరో వినియోగదారుడు ఫోన్..

☛ ఇదీ వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు గానీ, అధికారులకు గానీ ఫిర్యాదులు వస్తే అధికారులు స్పందించి ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేవారు. ఫిర్యాదులు వస్తే తప్ప అధికారులు కార్యాలయాల నుంచి కదిలే పరిస్థితి అంతగా ఉండేది కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఒకవైపు ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు వచ్చే సమస్యల పరిష్కారానికే పరిమితమయ్యే టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు ఇప్పుడు బస్తీ బాట పట్టారు. ప్రతి బుధవారం బస్తీల్లో తిరుగుతూ కరెంటు సమస్యలను నేరుగా తెలుసుకోవడమే కాదు..పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకుంటున్నారు. క్రిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత ఉద్యోగి వరకు బస్తీ బాట కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో మమేకమై విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్నారు.

వర్షాకాలంలో..అప్రమత్తంగా ఉంటూ..

వర్షాకాలం నేపథ్యంలో సాధారణంగా తలెత్తే కరెంటు సమస్యలకు చెక్ పెట్టేలా ఈ బస్తీబాట కార్యక్రమం దోహదపడుతుంది. గ్రీన్‌ల్యాండ్స్, బంజారాహిల్స్, ప్యారడైజ్ డివిజన్ల పరిధిలోని గ్రీన్‌ల్యాండ్స్, సనత్‌నగర్, మోతీనగర్, బేగంపేట, ఎర్రగడ్డ, బైబిల్ హౌస్, ప్యారడైజ్, జనరల్‌బజార్, క్లాక్‌టవర్, పద్మారావునగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని లైన్‌మెన్ నుంచి ఆయా ప్రాంతాల ఎస్ఈలు, డీఈలు, ఏఈలు బస్తీబాట కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

☛ ముఖ్యంగా ఎక్కడైనా స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు గుర్తించిన వెంటనే వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

☛ బేగంపేట ప్రకాష్‌నగర్‌లో పర్యటన సమయంలో ఐరన్ స్తంభాలు వంగిపోయి ఉన్నాయని.. ఇళ్ల మీదకు తీగలు రావడంతో కరెంటు షార్ట్‌సర్క్యూట్ వస్తుందని, వర్షాకాలంలో ఇళ్ల గోడలకు కూడా కరెంటు షాక్ వస్తుందంటూ స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

☛ పలుచోట్ల ఎల్‌టీ విద్యుత్ కేబుల్ స్థానంలో ఎయిర్ బంచింగ్ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటుచేయడం ద్వారా షార్ట్‌సర్క్యూట్ సమస్యలకు చెక్ పెట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

☛ కేవలం ప్రత్యక్ష సమస్యలే కాకుండా బిల్లుల్లో లోపాలు ఉంటే వాటిని అక్కడికక్కడే సరిజేయడానికి యత్నిస్తున్నారు. అలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులకు కార్యాలయానికి పిలిపించి వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

> **క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం**
>
> బస్తీబాట కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరుగుతుంది. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అలాగే తామే స్వయంగా సమస్యలు పరిశీలించే అవకాశం ఉంటుంది.
>
> – వంశీకృష్ణ, టీజీఎస్‌పీడీసీఎల్ ఏడీఈ, సనత్‌నగర్

త్వరలో మెట్టుగూడ జంక్షన్ సుందరీకరణ పనులు

సికింద్రాబాద్: మెట్టుగూడ కూడలిలో సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. జంక్షన్ల బ్యూటిఫికేషన్ కార్యక్రమాల్లో భాగంగా ఈ కూడలిని ఆధునీకరించనున్నారు. మెట్టుగూడ కూడలి నుంచి తార్నాక వెళ్లే ప్రాంతంలో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ కుర్చీలు ఏర్పాటు చేసిన అధికారులు గ్రీనరీ ఏర్పాటు, వింగ్స్ బిగించడం వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం రూ.7 లక్షలు జీహెచ్ఎంసీ మంజూరు చేసినట్టు అసిస్టెంట్ ఇంజినీర్ సదజా తెలిపారు. ఆగస్టు మొదటివారంలోపు జంక్షన్ సుందరీకరణ పనులు పూర్తిచేయనున్నట్టు ఆమె చెప్పారు.

3 నుంచి మాస్టర్ అథ్లెటిక్స్

రసూల్‌పురా: మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు మూడు నుంచి జింఖాన మైదానంలో మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్ తెలిపారు. కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ జంపన ప్రతాప్‌తో కలసి బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌కు కలసి ప్రభు కుమార్ గౌడ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు..

సనత్‌నగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన చౌకట్ అవినాష్ వివిధ వైన్ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. పోలీసులు అతని ఇంట్లో సోదాలు జరపగా పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని అవినాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లోన్ పేరిట రూ.70.37లక్షల మోసం

రాంగోపాల్‌పేట్: ఓ వ్యాపారికి రూ.5కోట్ల బిజినెస్ రుణం ఇప్పిస్తానంటూ రూ.70.37లక్షల వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని మహంకాళి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన మేరకు.. ఏఎస్‌రావునగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు మచ్చ బొల్లారంకు చెందిన ఎం శ్రవణ్‌కుమార్ (35)తో పరిచయం ఏర్పడింది. అనిల్‌కుమార్‌కు రూ.5కోట్ల బిజినెస్‌లోన్ ఇప్పిస్తానని శ్రవణ్‌కుమార్ చెప్పాడు. బ్యాంకు రుణం కోసమని విడతల వారిగా అనిల్‌కుమార్ నుంచి రూ.70,37,136 వసూలు చేశాడు. నమ్మించేందుకు నకిలీ లోన్ శాంక్షన్ లెటర్, చెక్కులు ఇచ్చాడు. అయితే అవి నకిలీవని బాధితుడికి తెలియడంతో ఈ నెల 18వ తేదీన మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం నిందితుడు కరీంనగర్‌లో ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి భార్య స్రవంతి పరారీలో ఉంది.

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సాక

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి శుక్రవారం అమ్మవారికి సాక సమర్పించారు. బోనాల జాతర సందర్భంగా రంగం కార్యక్రమంలో తనకు ఐదు వారాల పాటు పప్పు, బెల్లంతో పాటు సాక సమర్పించాలని అమ్మవారు సూచించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి శుక్రవారం ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో 21 సాక అమ్మవారికి సమర్పించారు.

వర్షాకాలం వ్యాధుల నియంత్రణకు చర్యలు

లాలాపేట: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులతో, అక్కడికి వచ్చిన పేషెంట్లతో మాట్లాడారు. పీహెచ్‌సీలను మినీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, సిబ్బంది హేమలత, గీత తదితరులున్నారు.


పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

జోరు వానకు జనం బేజారు


లాలాపేటలో వర్షంలోనే ఇంటి బాట పట్టిన విద్యార్థులు

లాలాపేట: కొద్ది రోజులుగాఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరమంతా ఎక్కడ చూసినా వరద నీరే. కాలనీలు, బస్తీల్లో నాలాలు, మ్యాన్ హోళ్లు పొంగి పొర్లుతున్నాయి. వరద నీటి కోతకు రోడ్లన్నీ ఫాడైనాయి. లోతట్టు ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లపై భారీగా వర్షం నీరు నిలిచింది. భారీ వర్షాలకు వాతావరణం పూర్తిగా చల్లబడింది. శుక్రవారం తార్నాక, లాలాపేట, శాంతినగర్‌లో కురిసిన జోరు వానకు జనమంతా బేజారయ్యారు. అడ్డా కూలీలు, ఫుట్‌పాత్ వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రం వేళ స్కూల్ ముగిసే సరికి ఒక్కసారిగా జోరందుకుంటున్న వర్షానికి విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు తడిసిపోయారు. స్కూల్స్, కాలేజీల నుంచి ఒక్కసారిగా విద్యార్థులు బయటకు రావడంతో రోడ్లపై ట్రాఫిక్ జాం నెలకొంది.

మేడిబావి బోనాలకు భారీ ఏర్పాట్లు

27,28 తేదీల్లో ఎల్లమ్మ బోనాల వేడుకలు


శ్రీ దేవి దండుమారమ్మ అమ్మవారు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావిలో అత్యంత ప్రాచీనమైన శ్రీఎల్లమ్మ ముత్యాలమ్మ ఆలయంలో ఆలయంలో బోనాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27,28 తేదీల్లో ఇక్కడ ఘనంగా బోనాల వేడుకలు జరుగనున్నాయి. రావి, వేప చెట్ల నీడన వెలసిన దేవాలయంలో మేడిబావి అమ్మవార్లు కొలువుదీరారు. ఆలయం సమీపంలో నెలకొని ఉన్న బావి నీళ్లను ఒంటిపై జల్లుకోవడం ద్వారా రోగాలు దరిచేరవన్నది ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ముత్యాలమ్మ, ఎల్లమ్మ దేవాలయ బాధ్యతలను స్వీకరించిన స్థానిక పారిశ్రామికవేత్త పరికిబండ కళాప్రకాశ్ ఆలయాన్ని నిర్మించడంతోపాటు 26 ఏళ్లగా ఘనంగా ఏటా బోనాల జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు అత్యంత ఘనంగా నిర్వహించనున్న ముత్యాలమ్మ, ఎల్లమ్మ బోనాల వేడుకలకు సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం రానున్నట్లు అంచనా వేస్తున్నారు. మాజీ మంత్రులు తీగుళ్ల పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్, ఈఓ. జీ.శ్రీనివాసులు తెలిపారు.


ముస్తాబైన మేడిబావి శ్రీఎల్లమ్మ ముత్యాలమ్మ ఆలయం

రసూల్‌పురా: శ్రావణమాసంలో మొదటి ఆదివారం ఈనెల 27, 28 తేదీల్లో కంటోన్మెంట్‌లోని శ్రీ దేవి దండుమారమ్మ ఆలయం, ఈద్గా అంబేద్కర్ నగర్ సీతల పోచమ్మ ఆలయాల బోనాల జాతరతో శ్రావణ మాసం బోనాలు ప్రారంభమవుతాయి ఆ తర్వాత ఆగష్టు మొదటి ఆదివారం 3, 4 తేదీల్లో అన్నానగర్ లోని పోచమ్మ, పెద్దమ్మ, చిత్తారమ్మ, మైసమ్మ ఆలయాలు, రెండవ ఆదివారం 10, 11తేదీల్లో కార్ఖానలోని మహంకాళి, మడ్‌ఫోర్ట్‌లోని మహంకాళి, అంబేద్కర్ హట్స్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో బోనాల జాతర, రంగం కార్యక్ర మాలు ఘనంగా నిర్వహిస్తారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

సనత్‌నగర్: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మోతీనగర్ అవంతినగర్ తోటకు చెందిన కేతినేని సిద్దార్థ, తులసీలు భార్యాభర్తలు.ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి.ఈ నెల 24న భార్యను ఆమెను బంజారాహిల్స్‌లో డ్యూటీ చేసే ప్రాంతంలో దింపి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమెకు తన భర్త కనిపించలేదు. పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది.

కిరాయికి వెళ్లి వస్తానని చెప్పి కారు డ్రైవర్..

మోతీనగర్ అవంతినగర్‌కు చెందిన సురేందర్, స్వాతి దంపతులు. సురేందర్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 23న గుత్తికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధుమిత్రులను వాకబు చేసినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాద చేసింది.

స్కూల్ నుంచి ఇద్దరు బాలురు అదృశ్యం

రాంగోపాల్‌పేట్: స్కూలుకు వెళ్లిన ఇద్దరు బాలురు అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. మహంకాళి పోలీసులు తెలిపిన మేరకు.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లికి చెందిన పీ రాజు (13), శివశంకర్ (12)లు ఆశ్రిత హోంలో ఉంటూ ఆదయ్య మెమోరియల్ హైస్కూల్‌లో 8వ,7వ తరగతులు చదువుతున్నారు.


అదృశ్యమైన బాలురు

ఈ నెల 23వ తేదీన పాఠశాలకు వెళ్లిన ఇద్దరూ ఇంటర్వెల్‌లో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇంజినీరింగ్ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణ నిబంధనలకు విరుద్ధంగా ఇంజినీరింగ్ సీట్లు కేటాయించారని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల రోస్టర్ విధానంలో ఇప్పటికే మాలలకు అన్యాయం జరిగిందని తాజాగా కేటాయించిన ఇంజినీరింగ్ సీట్లలో సైతం తీరని అన్యాయం జరిగిందన్నారు.

మార్కెట్‌లో సమస్యలు తీర్చండి



కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకారం అందించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కోరారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డీబీ దేవేందర్ పాటు కోదండ రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మార్కెట్ యార్డును మోండా నుంచి బోయిన్‌పల్లికి తరలించి దాదాపు 20 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తాగునీటి సదుపాయం లేదని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సనత్‌నగర్: స్కూటీపై ఆగి ఉన్న వ్యక్తిని ఎదురుగా బుల్లెట్‌పై వచ్చిన వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.సనత్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ ఆనంద్‌నగర్‌కు చెందిన జంగయ్య ((59) ఈ నెల 20న సాయంత్రం ఎర్రగడ్డలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద స్నేహితుడితో మాట్లాడుతుండగా బంజారానగర్ వైపు నుంచి ఎదురుగా వచ్చిన బుల్లెట్ బైక్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో జంగయ్య ఎడమ కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు అతన్ని ఈఎస్ఐ ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

పార్టీలకతీతంగా రిజర్వేషన్ల అమలుకు ఎంపీలు కృషి చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పార్టీలకు అతీతంగా ఎంపీలు కృషిచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ముస్లీం రిజర్వేషన్లను ముడిపెట్టడం సరికాదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో 29 ముస్లీం వర్గాల వారు బీసీ రిజర్వేషన్ల జాబితాలో ఉన్నారని వివరించారు.

వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా కిషోర్ నియామకం

సికింద్రాబాద్: వికలాంగుల హక్కుల పోరాట సమితి సీతాఫల్ మండి అధ్యక్షుడిగా కిషోర్, ఉపాధ్యక్షుడిగా జై చంద్రలు శుక్రవారం నియమితులయ్యారు. చేయూత పింఛన్ దారుల పోరాట సమితి డివిజన్ అధ్యక్షురాలుగా శ్యామలను నియమించారు. శుక్రవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో జరిగిన ఎంఆర్‌పీఎస్ సికింద్రాబాద్ ఇంఛార్జి డప్పు మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు సొట్ట నరేంద్రబాబు మాదిగ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చేయూత పెన్షన్ లన్ని తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు.

ఓయూ సెక్యూరిటీ సిబ్బందిపై వీసీ సీరియస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెక్యూరిటీ సిబ్బంది పై వీసీ ప్రొ.కుమార్ శుక్రవారం మండిపడ్డారు. ఈ నెల 21న వనభోజనాల సందర్భంగా బయటి వ్యక్తులు క్యాంపస్‌లో మద్యం సేవించి విద్యార్థుల పై దాడి చేయడం పట్ల వీసీ ఆగ్రహం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గార్డులకు షోకాజ్‌నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

27న బోనాల వేడుకలు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కులో ఈ నెల 27 ఆదివారం అమ్మవారి బోనాల వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి, ఈసీ రావు, క్రిష్టారావు, జీకే రావు, టి. వెంకటరమణలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించడానికి విస్తతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం అమ్మవారికి పూజా కార్యక్రమాలు, బోనం సమర్పణ ఉంటుందన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది : కేటీఆర్

కంటోన్మెంట్: ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు తమ పోరాటాల్లో వెనక్కి తగ్గొద్దని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ‘ఏ టూ జెడ్’ అంటూ ఇటీవల కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయంలో పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తలు కళ్యాణ్ సందీప్, సాయికిరణ్, రఘులు శనివారం మన్నె క్రిశాంక్‌తో పాటు కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ వీరిని అభినందించడంతో పాటు వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు క్షమాపణ చెప్పాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వెంటనే క్షమాపన చెప్పాలని, లేని పక్షంలో ఇంటిని ముట్టడిస్తామని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీసీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టలేమనడం అవివేకమన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించి ఇప్పుడు బీజేపీ వ్యతిరేకించడం సిగ్గుచేటు అన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో దివ్యాంగుల రిజర్వేషన్లు పాటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ కేటగిరి–2 ప్రవేశాల్లో వికలాంగుల రిజర్వేషన్లు పాటించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ అందే రాంబాబు, రీసెర్చ్ స్కాలర్ పల్స ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీసీ ప్రొ.కుమార్‌కు వినతి సమర్పించేందుకు రాగా గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోగా ప్రవేశ ద్వారం ఎదుట వర్షంలో నిరసన తెలిపారు.

కూల్చివేతలకు రంగం సిద్ధం

- బోర్డు అధికారులతో హైడ్రా కమిషనర్ కీలక భేటీ
- వచ్చే వారం నుంచి ఆక్రమణల తొలగింపునకు నిర్ణయం

కంటోన్మెంట్: ఎట్టకేలకు హైడ్రా కంటోన్మెంట్‌లోకి ఎంటర్ కాబోతుంది. గత నెలలో ప్యాట్నీ నాలా ఆక్రమణలతో తొలగింపుతో మొదలుపెట్టి ఇక పూర్తిస్థాయిలో నాలాలు, చెరువుల ఆక్రమణల భరతం పట్టేందుకు సిద్ధం అవుతోంది. హైడ్రా, రెవెన్యూ, కంటోన్మెంట్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన డ్రోన్ సర్వే ఆధారంగా ఆక్రమణలను గుర్తించారు. వీటి తొలగింపు విధి, విధానాల ఖరారుకు శుక్రవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగింది. కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, కంటోన్మెంట్ ఇంజనీర్ ఉమాశంకర్, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, ఏసీపీలు రాజేశ్వర్, శివాజీలతో కూడిన బృందం ఈ సమావేశంలో పాల్గొంది. ఈ పాటికే గుర్తించిన ఆక్రమణలతో పాటు భవిష్యత్‌లో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల ఆధారంగా చేపట్టే కూల్చివేతలపై ప్రత్యేక కార్యాచరణకు రంగం సిద్ధం చేశారు. ఆగస్టు మొదటివారంలో కంటోన్మెంట్– హైడ్రా కూల్చివేతలు ప్రారంభించే అవకాశముందని బోర్డు ఉన్నతాధికారులు వెల్లడించారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కంటోన్మెంట్ అధికారుల భేటీ

ఫిర్యాదులు వెల్లువెత్తడంతో..

వర్షాలు పడినప్పుడు కంటోన్మెంట్‌లోని పికెట్, హస్మత్‌పేట నాలాల పరివాహక బస్తీలు, కాలనీలు నీట మునగడం పరిపాటిగా మారింది. ఈ రెండు నాలాలు కలిసే ప్యాట్నీ ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో బాధిత ప్రజలు ఇటు కంటోన్మెంట్, అటు హైడ్రాకు ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే గత నెలలో హైడ్రా అధికారులు ప్యాట్నీ నాలా వెంబడి ఉన్న నాలుగైదు నిర్మాణాలను కూల్చివేశారు. ఇదే అదనుగా భావించిన బోర్డు అధికారులు ఇతర ఆక్రమణలపై కూడా దృష్టి సారించారు. రెవెన్యూ, హైడ్రా అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించారు. పికెట్, ప్యాట్నీ నాలాలతో పాటు రామన్నకుంట, తిరుమలగిరి చెరువుల వెంబడి ఉన్న ఆక్రమణలను గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించారు.

> **వారంలో కూల్చివేతలు ప్రారంభిస్తాం**
>
> నాలాలు, చెరువుల ఆక్రమణలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే హైడ్రాతో కలిసి సంయుక్త కార్యాచరణ చేపట్టాం. తొలుత నాలాల్లో పూడికతీత, చిన్నపాటి అడ్డంకులు తొలగిస్తాం. దశలవారీగా అక్రమ నిర్మాణాలు అన్నింటినీ తొలగిస్తాం. హైడ్రా కూల్చివేతల పేరిట ఎవరైనా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడితే వారిపైనా చర్యలు తీసుకుంటాం.
>
> – మధుకర్ నాయక్, సీఈఓ